సాక్షి
నిజామాబాద్
ఆదివారం । 26 । నవంబర్ । 2023



స్త్రీలపై హింసను వ్యతిరేకిద్దాం

స్త్రీలపై హింసను వ్యతిరేకిద్దామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల అన్నారు.

- 6లో ▸



ఒకేసారి రన్ చేయొద్దు

మిషన్ భగీరథ పంపు హౌస్‌లలో మోటార్లను ఒకేసారి ఎక్కువగా రన్ చేయకూడదని చీఫ్ ఇంజినీర్ రాంచందర్ సూచించారు.

- 6లో ▸

గరిష్టం/కనిష్టం
27.1 /21.4

వాతావరణం

ఉదయం శీతల గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. చలి తీవ్రత కాస్త పెరగొచ్చు.



కామారెడ్డిలో సకల జనుల విజయ సంకల్ప సభలో పాల్గొన్న ప్రజలు


కేసీఆర్, రేవంత్‌లకు గుణపాఠం చెప్పండి

- కామారెడ్డి ప్రజలకు గొప్ప అవకాశమొచ్చింది
- ఓటమి భయంతోనే రెండు చోట్లా పోటీ చేస్తున్నారు
- కామారెడ్డి సభలో ప్రధాని నరేంద్రమోదీ
- సభ సక్సెస్‌తో బీజేపీ శ్రేణుల్లో జోష్
- మార్మోగిన మోదీ నామస్మరణ

జంగ్ తెలంగాణ

తెలంగాణకు చేసిందేమీ లేకపోగా.. వాళ్ల కుటుంబాల కోసమే పనిచేసే పార్టీల నుంచి ఎన్నికల్లో పోటీ చేస్తున్న సీఎం కేసీఆర్, పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డిలను కామారెడ్డి ప్రజలు ఓడించి గుణపాఠం చెప్పాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ గ్రౌండ్స్‌లో నిర్వహించిన సకల జనుల విజయ సంకల్ప సభలో ఆయన మాట్లాడారు. వేలాదిమంది జనం హాజరు కాగా 'మోదీ' నామస్మరణతో సభా ప్రాంగణం మోరుమోగింది.

సాక్షి, కామారెడ్డి/కామారెడ్డి క్రైం/కామారెడ్డి టౌన్ : 'బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు వాళ్ల కుటుంబాల కోసమే పనిచేస్తాయి. తెలంగాణ కోసం వాళ్లు చేసిందేమీ లేదు. ఇప్పుడు కామారెడ్డి నుంచి ఆ పార్టీల ముఖ్యనాయకులు సీఎం కేసీఆర్, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. వారిని ఓడించి గుణపాఠం చెప్పాలని ప్రధాని నరేంద్రమోదీ పిలుపు నిచ్చారు. ఇలాంటి అవకాశం మరెవరికీ దొరకదని, అది ఒక్క కామారెడ్డి ప్రజలకే దొరికిందని, కచ్చితంగా ఓటు ద్వారా బుద్ధి చెప్పాలన్నారు. శనివారం కామారెడ్డిలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ గ్రౌండ్స్‌లో సకల జనుల విజయ సంకల్ప సభలో మోదీ మాట్లాడారు. ఓటమి భయంతో వాళ్లిద్దరూ రెండు చోట్ల పోటీ చేస్తున్నారని అన్నారు. తొమ్మిదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఎంతో అన్యాయం చేసిందన్నారు. బీజేపీ మీద తెలంగాణ ప్రజలకు ఎన్నో ఆశలు ఉన్నాయని, వారి ఆశలను నెరవేర్చడానికి తాను అండగా ఉంటానన్నారు. కేసీఆర్‌ను డిసెంబర్ 3న ఇంటికి పంపించాలన్నారు.



మోదీకి ఆయన తల్లితో కలిసి ఉన్న చిత్రపటం బహూకరిస్తున్న రమణారెడ్డి

భారీ బందోబస్తు

మోదీ సభ నేపథ్యంలో రాష్ట్ర, కేంద్ర బలగాలతో భారీ బందోబస్తు నిర్వహించారు. అడుగడునా తనిఖీలు చేసారు. సభా ప్రాంగణం చుట్టూ ఉన్న కాలనీలో ఇండ్లపై కూడా పోలీసులు పహారగా ఉన్నారు. కేంద్ర బలగాలు, ఎస్పీ, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, కానిస్టేబుళ్లు భారీ బందోబస్తులో పాల్గొన్నారు.



జనసంద్రమైన సభ

సకల జనుల విజయ సంకల్ప సభ బీజేపీ శ్రేణుల్లో జోష్ నిపింది. సభా ప్రాంగణం వేలాదిమంది జనంతో కిక్కిరిసి పోయింది. మోదీ రాక కోసం ఉదయం 11 గంటల నుంచే ఎదురు చూశారు. పీఎం రాకముందే నేతల ప్రసగంలో సైతం మోదీ నినాదాలు మార్మోగాయి. మధ్యాహ్నం 2.39 గంటలకు పీఎం సభకు హాజరయ్యారు. ఒక్కసారిగా సభా ప్రాగంణంలో పెద్ద ఎత్తున 'మోదీ మోదీ' అంటూ నినాదాలతో జోష్ పెరిగింది. 35 నిమిషాల పాటు మోదీ ప్రసంగించారు. ఆయన బీఆర్ఎస్, కాంగ్రెస్ తీరును తనదైన శైలీ మాటలలో ఎండగట్టారు. బీఆర్ఎస్‌కు నీటి పారుదల ప్రాజెక్టులు ఏటీఎంలాగా మారాయని ఆరోపించారు. కాంగ్రెస్‌కు ఓటు వేసి మోసపోవద్దన్నారు. సకలనుల సౌభాగ్య తెలంగాణే బీజేపీ లక్ష్యమన్నారు. రాష్ట్రంలో, కామారెడ్డిలో అవినీతి రహిత, రామరాజ్యం తెస్తానని అన్నా రు. రాష్ట్రంలో ఒక్కసారి బీజేపీకి అవకాశం ఇవ్వాలన్నారు. పదే పదే 'నా కుటుంబ సభ్యుల్లారా' అంటూ వాఖ్యానిస్తూ స్పీచ్‌తో ఆకట్టుకున్నారు. వెంకట రమణారెడ్డిని గెలిపించాలని ఓటర్లను కోరారు.







వేదికపై బీజేపీ అభ్యర్థులు సుభాష్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, అరుణతార, యెండల తదితరులు

కేసీఆర్‌ను ఓడించడమే లక్ష్యం

- 'ధరణి'తో పేదల భూములు లాక్కున్నారు
- మళ్లీ అధికారంలోకి వస్తే ఉన్న భూములు గుంజుకుంటారు
- బోధన్ కాంగ్రెస్ విజయభేరి సభలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ



మాట్లాడుతున్న రాహుల్‌గాంధీ

బోధన్ : తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వాన్ని ఓడించడమే తమ లక్ష్యమని, ఆ తర్వాత ఢిల్లీలో నరేంద్రమోదీ ప్రభుత్వాన్ని ఓడించాల్సి ఉందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ అన్నారు. తెలంగాణలో కేసీఆర్ రాజ్యం, ఢిల్లీలో మోదీ రాజ్యం ఉండాలని వారు కోరుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. కానీ తెలంగాణలో కాంగ్రెస్ కారు టైర్లల్లో గాలి తీసేసిందని చెప్పారు. బోధన్ కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ మంత్రి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి నేతృత్వంలో శనివారం మధ్యాహ్నం బోధన్ శివారులోని నర్సాపూర్ క్రాసింగ్ వద్ద నిర్వహించిన విజయభేరి సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేసీఆర్ సర్కారు అవినీతిమయంగా మారిందన్నారు. ఈ సారి బోధన్ కాంగ్రెస్ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డిని గెలిపించాలని రాహుల్‌గాంధీ కోరారు. ఈ ఎన్నికలు దొరల రాజ్యం, ప్రజల మధ్య జరుగుతున్నాయని అన్నారు. కేసీఆర్ ధరణి పోర్టల్ పేరుతో పేదల భూములను లాక్కున్నారని ఆరోపించారు. తన ఎమ్మెల్యేలు, ప్రభుత్వ పెద్దలకు పేదల భూములను ధారదత్తం చేశారన్నారు. మళ్లీ గెలిస్తే కేసీఆర్ పేదల వద్ద ఉన్న భూములను కూడా గుంజుకుంటారని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో పేదలకు భూములు పంచామన్నారు. అధికారంలోకి వచ్చాక భూ బాధితులకు న్యాయం చేస్తామన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేస్తాం

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని రాహుల్‌గాంధీ అన్నారు. రైతుల బాధలు, అప్పులను తీర్చి ఆర్థికంగా మరింత బలోపేతం చేసేందుకే రైతు భరోసా స్కీం అమలు చేస్తామన్నారు. కౌలు రైతులకు పెట్టుబడి సాయం వర్తింపజేస్తామని తెలిపారు. మహిళలకు నెలకు రూ.2500, రూ.500లకే గ్యాస్ సిలిండర్, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామన్నారు. రాష్ట్రంలో భూ, లిక్కర్, మైనింగ్ మాఫియా రాజ్యం సాగుతోందని ఆయన ఆరోపించారు. ఆర్థిక వనరులున్న మంత్రిత్వ శాఖలు కేసీఆర్ కుటుంబ సభ్యుల చేతిలో ఉన్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఏమి చేసిందని మాట్లాడుతున్నారని.. కేసీఆర్ చదివిన బడి, యూనివర్సిటీ, హైదరాబాద్‌లో విమానాశ్రయాలు, రింగ్ రోడ్డు, మెట్రో ప్రాజెక్టు, ఐటీ సిటీ కాంగ్రెస్ హయాంలోనే జరిగాయని వివరించారు. కేసీఆర్ కూర్చున్న సీఎం సీటు కూడా కాంగ్రెస్ ఇచ్చిందేనన్నారు.

ఆ రెండు పార్టీలు ఒక్కటే

బీఆర్ఎస్, బీజేపీలు ఒక్కటేననే విషయం ప్రజలు గమనించాలని రాహుల్‌గాంధీ కోరారు. తెలంగాణలో కేసీఆర్ అవసరాలను మోదీ, ఢిల్లీలో మోదీ అవసరాలను కేసీఆర్ తీరుస్తున్నారని ఆరోపించారు. మోదీ ప్రవేశపెట్టిన జీఎస్టీ, పెద్ద నోట్ల రద్దు, రైతు చట్టాల బిల్లులకు బీఆర్ఎస్ ఎంపీలు మద్దతు ఇచ్చారని గుర్తు చేశారు. బీజేపీపై పోరాడుతుంటే తనపై కేసులు పెట్టి, ఎంపీ సభ్యత్వం రద్దు చేశారన్నారు. కానీ అవినీతి ఆరోపణలు ఉన్న కేసీఆర్‌పై కేసులు పెట్టలేదని విమర్శించారు.

కాంగ్రెస్‌లో చేరిన మండవ

మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు రాహుల్ గాంధీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కేసీఆర్ అవినీతి ప్రభుత్వం మార్పు కోసమే తాను కాంగ్రెస్‌లో చేరానని మండవ అన్నారు. యావత్ దేశ ప్రజానీకం తెలంగాణ ఎన్నికల్లో ప్రజాతీర్పు కోసం ఎదురు చూస్తున్నారని జమ్ముకాశ్మీర్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు షానవాజ్ హుస్సేన్ అన్నారు. మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్‌రావు చవాన్, నిజామాబాద్‌రూరల్, బాల్కొండ కాంగ్రెస్ అభ్యర్థులు భూపతిరెడ్డి, ముత్యాల సునీల్‌కుమార్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్ హందాన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ ఈరవత్రి అనిల్, పీసీసీ డెలిగెట్ గంగాశంకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మాశరత్‌రెడ్డి, సైదా అబిద్ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ రావడం అదృష్టం

- కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి



రాహుల్ గాంధీ బోధన్‌కు రావడం అదృష్టంగా భావిస్తున్నా. కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలకు మోసం చేసింది. ప్రాజెక్టుల పేరుతో రూ. కోట్ల ప్రజల సొమ్ము దోచుకున్నారు. నిజాం షుగర్స్ టేకోవర్ చేసుకుంటానని హామీ ఇచ్చిన కేసీఆర్ ఫ్యాక్టరీ బంద్ పెట్టించారు. స్థానిక ఎమ్మెల్యే షకీల్ అవినీతిలో కూరుకుపోయారు. నన్ను ఆశీర్వదించి గెలిపిస్తే అభివృద్ధి చేస్తా.



వేదికపై రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ అభ్యర్థులు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, సునీల్‌రెడ్డి తదితరులు

న్యూస్‌రీల్

నేడు కామారెడ్డికి రాహుల్ గాంధీ

సాక్షి, కామారెడ్డి : కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 26న మధ్యాహ్నం కామారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ గ్రౌండ్స్‌లో నిర్వహించే సభలో పాల్గొననున్నారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తరఫున ఆయన ప్రచార సభలో పాల్గొంటున్నారు. హెలికాప్టర్ ద్వారా జిల్లా కేంద్రానికి చేరుకున్న తర్వాత కాన్వాయ్‌లో సభా ప్రాంగణానికి చేరుకుంటారు. నియోజకవర్గంలోని ఆయా మండలాల నుంచి భారీ సంఖ్యలో జనాన్ని తరలించడానికి ఏర్పాట్లు చేశారు. నామినేషన్ రోజు ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగిన సభలో రేవంత్‌రెడ్డితో పాటు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య తదితరులు పాల్గొన్నారు. తర్వాత రామారెడ్డి మండలం రెడ్డిపేట, పాల్వంచ మండలం ఇసాయిపేట, ఫరీదుపేట, మాచారెడ్డి మండలం చుక్కాపూర్, మాచారెడ్డి గ్రామాల్లో కార్నర్ మీటింగుల్లో రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. భిక్కనూరు, రాజంపేటలలో రోడ్డు షోల్లో ప్రసంగించారు. రేవంత్‌రెడ్డి తరఫున పలువురు నాయకులు ప్రచారం చేస్తున్నారు.

ముగిసిన ఓట్ ఫ్రం హోం

సుభాష్‌నగర్ : ఎన్నికల సందర్భంగా 80 ఏళ్ల పైబడిన వృద్ధులు, 40 శాతం వైకల్యం ఉన్న దివ్యాంగులకు ఇంటి వద్దే ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించింది. శనివారంతో ఓట్ ఫ్రం హోం ప్రక్రియ ముగిసింది. దీని కోసం మొత్తం 2,418 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఆరు నియోక వర్గాల్లో గురు, శుక్రవారాల్లో 2,003 మంది ఓటు వేశారు. ప్రత్యేక ఎన్నికల అధికారులు దరఖాస్తు చేసుకున్న వారి ఇంటికి వెళ్లి పోలీస్ బందోబస్తు మధ్య ఓట్లు వేయించారు.



బాల్కొండలో మాట్లాడుతున్న విజయశాంతి

బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే!

- కాంగ్రెస్ ప్రచార కమిటీ చీఫ్ కో ఆర్డినేటర్ విజయశాంతి



స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌కు హాజరైన ప్రజలు

బాల్కొండ : బీజేపీ, బీఆర్ఎస్ రెండు పార్టీలు ఒకటేనని కాంగ్రెస్ ప్రచార కమిటీ చీఫ్ కో ఆర్డినేటర్, మాజీ ఎంపీ విజయశాంతి అన్నారు. శనివారం బాల్కొండ మండల కేంద్రంలో నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రాన్ని దోచుకు తింటున్న కేసీఆర్‌పై బీజేపీ చర్యలు తీసుకుంటుందని ఆశించి ఆ పార్టీలో చేరానని చెప్పారు. తెర వెనుక రెండు పార్టీలు ఒకటే అని తెలిసి, కేసీఆర్‌ను బొంద పెట్టే పార్టీ కాంగ్రెస్ అని నమ్మి ఈ పార్టీలో చేరానన్నారు. ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాష్ట్రానికి వచ్చినప్పుడు కేసీఆర్ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తారని కానీ చర్యలు మాత్రం చేపట్టరని పేర్కొన్నారు. ప్రస్తుతం బీజేపీ అగ్రనాయకులు సమావేశాలు ఏర్పాటు చేసి కేసీఆర్‌ను తిట్టడం నాటకమే అన్నారు. లిక్కర్ స్కాంలో ఎమ్మెల్సీ కవితపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. కేసీఆర్‌పై పోరాటం చేసే పార్టీ కాంగ్రెస్ అన్నారు. కేసీఆర్ అంతర్జాతీయ కుట్రదారుడని విజయశాంతి ఆరోపించారు. ఎన్నికల్లో ఏవైన కుట్రలు చేసే ప్రమాదం ఉందన్నారు. అమరవీరుల స్తూపం నిర్మాణంలో కూడా కేసీఆర్ రూ.200 కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారన్నారు. రెండు సార్లు కేసీఆర్‌ను గెలిపించి ప్రజలు ఎంతో ఇబ్బంది పడ్డారని, మరోసారి ఆ తప్పు చేయొద్దని కోరారు. కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. బాల్కొండ కాంగ్రెస్ అభ్యర్థి సునీల్‌రెడ్డి, నాయకులు వెంకటేశ్‌గౌడ్, వేణుగోపాల్ యాదవ్, జక్క రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ గొంతు నొక్కాలని చూస్తున్నారు

- నగరంలో మంత్రి కేటీఆర్ ప్రచారం



రోడ్‌షోలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

నిజామాబాద్‌నాగారం : కేసీఆర్ గొంతు నొక్కాలని మోదీ, షా చూస్తున్నారని మంత్రి కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీకీ బీజేపీని ఢీకొనే దమ్ము లేదని, అందుకే చాలా చోట్ల ఓడిపోయే అభ్యర్థులను పోటీలో ఉంచిందని కేటీఆర్ ఆరోపించారు. శనివారం సాయంత్రం నిజామాబాద్ నగరంలో ఖిల్లా చౌరస్తా నుంచి గోల్డెన్ జూబ్లీ స్కూల్ వరకు నిర్వహించిన రోడ్ షోలో అర్బన్ అభ్యర్థి బిగాల గణేశ్‌గుప్తాతో కలిసి మంత్రి కేటీఆర్ పాల్గొని మాట్లాడారు. రాహుల్‌గాంధీ మైనారిటీలు పేదలు అంటున్నారని మరి, అధికారంలో ఉన్నపుడు ఏం చేశారని ప్రశ్నించారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో అన్ని మతాల వారు సంతోషంగా ఉన్నారన్నారు. కేసీఆర్ మైనారిటీల సంక్షేమానికి 12,780 కోట్లు ఖర్చు చేశారని చెప్పారు. 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.930 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. బీఆర్ఎస్, బీజేపీ ఒకటే అని కాంగ్రెస్ అంటోందని కానీ తాము బీజేపీతో ఇప్పటి వరకు పొత్తు పెట్టుకోలేదని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే బీజేపీకే మేలు జరుగుతుందన్నారు.

ముస్లింల శత్రువు కాంగ్రెస్



నిజామాబాద్‌నాగారం : ముస్లింలపై బీజేపీ నేరుగా శత్రుత్వాన్ని ప్రదర్శిస్తుంటే.. కాంగ్రెస్ కనిపించని శత్రువు అని ఎమ్మెల్సీ కవిత అన్నారు. నగరంలో శనివారం ఆటో టెక్నిషియన్ అసోసియేషన్ సమావేశంలో ఆమె మాట్లాడారు. ముస్లింలకు ఏ పార్టీ అండగా ఉందో ఆలోచించాలన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా వచ్చి అబద్దాలు చెప్పి వెళ్లిపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని మతాలను బీఆర్ఎస్ సమానంగా చూస్తుందన్నారు. రాష్ట్రంలో ఎలాంటి మత కలహాలు లేకుండా కేసీఆర్ పాలన చేశారన్నారు. అర్బన్ బీఆర్ఎస్ అభ్యర్థి బిగాల గణేశ్‌గుప్తాను గెలిపించాలని కోరారు.

కాంగ్రెస్ వస్తే ఇందిరమ్మ రాజ్యం

- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి



అభివాదం చేస్తున్న రేవంత్‌రెడ్డి

నిజాంసాగర్/బిచ్కుంద(జుక్కల్) : సోనియా, రాహుల్ గాంధీ నేతృత్వంలో డిసెంబర్ 9న కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఇందిరమ్మ రాజ్యం తిరిగి తీసుకొస్తామని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలు ప్రజలకు పూర్తిగా భరోసా కల్పిస్తాయనే నమ్మకంతో మద్దతు తెలుపుతున్నారన్నారు. శనివారం బిచ్కుందలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోట లక్ష్మీకాంతరావుకు మద్దతుగా ఎన్నికల ప్రచారంలో భాగంగా సభలో ప్రసంగించారు. కేసీఆర్‌కు రెండుసార్లు అధికారం ఇస్తే లక్షల కోట్లు దోచుకున్నాన్నారని, హన్మంత్ సింధేకు మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిపిస్తే స్పీకర్ పోచారం కుటుంబంతో కలిసి మంజీరా నదిలో ఇసుక దోపిడీ చేసి రూ. కోట్లు సంపాదించారన్నారు. ఇసుక సొమ్ముతో ఎమ్మెల్యే హన్మంత్ సింధే పొరుగు రాష్ట్రంలో కోట్ల ఆస్తులు కూడబెట్టారని ఆరోపించారు. లెండీ ప్రాజెక్టు పూర్తి చేస్తామని సీఎం కేసీఆర్ తర్వాత ఊసెత్తలేదన్నారు. చెరుకు, ఇతర పంటల రైతులను ఆదుకోలేదన్నారు. ముస్లిం మైనార్టీ, గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్ కల్పించలేదని పేర్కొన్నారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు ఓటెయ్యొద్దు

- ఎస్సీ వర్గీకరణకు బీజేపీ కట్టుబడి ఉంది
- నిజామాబాద్ ఎన్నికల ప్రచారంలో ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ



అభివాదం చేస్తున్న మందకృష్ణ, ధన్‌పాల్, బస్వా

సుభాష్‌నగర్ : ఎన్నో ఏళ్లుగా మాదిగలను మోసం చేస్తున్న బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు ఓటెయ్యొద్దని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ కోరారు. శనివారం రాత్రి నగరంలోని వినాయక్‌నగర్‌లో బీజేపీ అభ్యర్థి ధన్‌పాల్ సూర్యనారాయణ ప్రచార కార్యక్రమానికి మందకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇందూరు ప్రజలందరివాడు, ఆపద్బాంధవుడు అయిన ధన్‌పాల్ సూర్యనారాయణను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. 30 ఏళ్లుగా ఒకే జెండా కింద పని చేస్తూ పోరాడానని, వర్గీకరణ కోసం ఢిల్లీ చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. మాదిగ బిడ్డల భవిష్యత్ కోసం పోరాటం చేశానని, గత పాలకులు మనల్ని విస్మరించారని గుర్తు చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మన కోసం హైదరాబాద్ వచ్చి ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ఉన్నామని, ఇందుకోసం కమిటీ వేస్తున్నామని ప్రకటించారని చెప్పారు. మాట ఇచ్చి నిలబెట్టుకునే పార్టీ బీజేపీ అన్నారు. ఉద్యమ సమయంలో అండగా నిలిచిన తనను కేసీఆర్ సీఎం అయ్యాక రెండు సార్లు జైలులో పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ మంత్రివర్గంలో ఒక్క మాదిగ బిడ్డ లేదన్నారు. తెలంగాణ కోసం మాదిగ యువత ఉద్యమించారని, అటువంటి మన ఉద్యమాన్ని కేసీఆర్ అణిచివేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల వద్దకు వెళ్లిన తనను వారు పట్టించుకోలేదని, బీజేపీ నాయకులు మన దగ్గరకు వచ్చి అక్కున చేర్చుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ అర్బన్ అభ్యర్థి ధన్‌పాల్ సూర్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కనక ప్రమోద్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు బీఆర్ శివప్రసాద్, రాష్ట్ర నాయకులు లింగంపల్లి లింగం, పడిగెల వెంకటేష్, కుమార్, ఎడ్ల బాలకృష్ణ, గడ్డం రాజు, శ్రీరాం పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్త్రీలపై హింసను వ్యతిరేకిద్దాం



ఖలీల్‌వాడి/ నిజామాబాద్‌ నాగారం: స్త్రీలపై హింసను వ్యతిరేకిద్దామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల అన్నారు. స్త్రీ పై హింసా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా కోర్టు ప్రాంగణంలో స్నేహ సొసైటీ సహకారంతో న్యాయసేవ సంస్థ నిర్వహించిన సదస్సులో జడ్జి మాట్లాడారు. కళాశాల విద్యార్థినులు జాగ్రత్తగా ఉండాలని, ఏ రకమైన ఉదారతను చూపరాదని సూచించారు. హింస నిరోధానికి ఉన్న చట్టపరమైన అవకాశాలను వినియోగించుకోవాలని జడ్జి కోరారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి, సీనియర్‌ సివిల్‌ జడ్జి పద్మావతి, స్నేహ సొసైటీ జ్యోతి, డాక్టర్‌ అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

టీచర్‌, హెచ్‌ఎం సస్పెన్షన్‌

పెర్కిట్‌(ఆర్మూర్‌): పెర్కిట్‌లోని ఓ పాఠశాలలో టీచర్‌, హెచ్‌ఎంలను డీఈవో దుర్గాప్రసాద్‌ శనివారం సస్పెన్షన్‌ చేసినట్లు ఎంఈవో రాజగంగారాం తెలిపారు. సదరు ఉపాధ్యాయుడు లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్లు విద్యార్థినులు హెచ్‌ఎం దృష్టికి తీసుకెళ్లిన స్పందించ లేదు. దీంతో డీఈవో టీచర్‌తో పాటు హెచ్‌ఎంను సస్పెన్షన్‌ చేసినట్లు ఎంఈవో పేర్కొన్నారు.

రూ.3.22 కోట్ల నగదు రిలీజ్‌

సుభాష్‌నగర్‌: జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో 138 కేసులకు సంబంధించి రూ.3.22 కోట్ల నగదు రిలీజ్‌ చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు శనివారం తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అధికారులు, పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీల్లో మొత్తం 156 కేసులు నమోదు కాగా రూ.5,14,13,127 కోట్ల నగదు, బంగారు, వెండి ఆభరణాలను పట్టుకుని సీజ్‌ చేశారు. జిల్లా గ్రీవెన్స్‌ కమిటీలో విచారణ చేపట్టి 138 కేసులకు సంబంధించి రూ.3,22,52,265 విలువైన నగదు, బంగారు, వెండి ఆభరణాలను విడుదల చేశారు. 2 కేసులకు సంబంధించి ఆదాయ పన్నుశాఖకు రూ.1,04,85,500 నగదును అప్పగించగా, మరో మూడు కేసులకు సంబంధించి రూ.56,32,310 నగదును సిఫార్సు చేసినట్లు తెలిపారు. మరో 13 కేసులను విచారించాల్సి ఉందని పేర్కొన్నారు.

ఖైదీలలో సత్ప్రవర్తన రావాలి



ఖలీల్‌వాడి: సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు క్రిమినల్‌ నేరాలలో ముద్దాయిలుగా ఉన్నవారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తామని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చీఫ్‌ లీగల్‌ ఎయిడ్‌ కౌన్సిల్‌ రాజ్‌ కుమార్‌ సుబేదార్‌ అన్నారు. శనివారం జిల్లా కేంద్ర కారాగారంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఖైదీలనుద్దేశించి ఆయన మాట్లాడారు. ఆర్థిక, సామాజిక పరిస్థితుల నేపథ్యంలో నేరాలకు పాల్పడిన వారు వాటికి దూరంగా ఉండాలని సూచించారు. జైలు అధికారులు, సిబ్బంది ఉన్నారు.

29న స్విమ్మింగ్‌లో ఎంపికలు

నిజామాబాద్‌నాగారం: నగరంలోని సుభాష‌నగర్‌లో ఉన్న ప్రభుత్వం స్విమ్మింగ్‌ఫూల్‌లో ఈనెల 29న సబ్‌జూనియర్‌, జూనియర్‌ విభాగాల్లో జిల్లా స్థాయి స్విమ్మింగ్‌ ఎంపికలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్‌ కార్యదర్శి మహిపాల్‌రెడ్డి శనివారం తెలిపారు. క్రీడాకారులు ఆధార్‌కార్డు, బోనాఫైడ్‌ తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాలకు 9866970010 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మహిళల ఆదరణతో విజయం సాధిస్తా..

- బీజేపీతోనే సాధ్యమైన మహిళా రిజర్వేషన్‌
- పార్టీ బాల్కొండ అభ్యర్థి ఏలేటి అన్నపూర్ణమ్మ



ఏలేటి అన్నపూర్ణమ్మ

మహిళల ఆదరణతో బాల్కొండ నియోజకవర్గంలో విజయం సాధిస్తానని బీజేపీ అభ్యర్థి ఏలేటి అన్నపూర్ణమ్మ అన్నారు. చట్టసభల్లో మహిళల భాగస్వామ్యం పెరగాలనే సంకల్పంతో ప్రధాని నరేంద్ర మోదీ బిల్లును ప్రవేశపెట్టారని, త్వరలో నే చట్టసభల్లో మహిళలకు తగిన ప్రాధాన్యత దక్కుతుందన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో 'సాక్షి' ఇంటర్వ్యూలో ఆమె పలు విషయాలపై చర్చించారు.

–మోర్తాడ్‌

సాక్షి ఇంటర్వ్యూ

● **నియోజకవర్గంలో చేపట్టే పనులు..?**

నేను గతంలో ఆర్మూర్‌ నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందాను. ఆ అనుభవంతో ఈసారి నా సొంత నియోజకవర్గమైన బాల్కొండ నుంచి బరిలో దిగడానికి పార్టీ అవకాశం ఇచ్చింది. రాబోయే రోజుల్లో నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా. బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలలకు సొంత భవనాలను నిర్మిస్తాం. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తాం. నిరుద్యోగ యువత వారు ఎంచుకున్న రంగంలో శిక్షణ ఇప్పించి ఉపాధి కల్పిస్తాం.

● **మహిళలకు ఇచ్చే భరోసా..?**

బీజేపీ అంటేనే మహిళలకు భరోసా. కేంద్రంలో అధికారంలో ఉండటం, పలు రాష్ట్రాల్లో మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే త్రిపుల్‌ తలాఖ్‌కు స్వస్తి పలికారు. బాల్కొండ నియోజకవర్గంలో గంజాయి గుప్పుమంటుంది. ఫలితంగా ఎంతో మంది మహిళలు ఇబ్బంది పడుతున్నారు. తాము గెలిస్తే గంజాయిని నిరోధించి మహిళలకు బాసటగా నిలుస్తాం.

● **సంక్షేమ పథకాల అమలు..?**

రేషన్‌ కార్డులు లేనివారికి కొత్తవి అందిస్తాం. ఇండ్లు నిర్మించుకునేవారికి ఆర్థిక సాయం, డిగ్రీ విద్యార్థులకు ఉచితంగా ల్యాప్‌ట్యాప్‌లు అందిస్తాం. ఉజ్వల లబ్ధిదారులకు ఏడాదికి ఉచితంగా నాలుగు సిలెండర్లను పంపిణీ చేస్తాం. గ్రామాల్లో అర్హులైన పేదలకు రాజకీయాలతో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలను అమలు చేస్తాం.

● **రైతుల కోసం పథకాలు..?**

బీజేపీ మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రకారం రైతులకు ధాన్యానికి బోనస్‌తో కలిపి క్వింటాలుకు రూ.3,100 మద్దతు ధర కల్పిస్తాం. ఎరువులు, విత్తనాలకు పెట్టుబడి కోసం రూ.2,500లు చెల్లిస్తాం. ఉచితంగానే పంట బీమా, పాలు ఇచ్చే ఆవులను ప్రతి రైతుకు అందిస్తాం.

● **నిరుద్యోగులకు ఉపాధి..?**

పార్టీ మేనిఫెస్టో ప్రకారం.. యూపీఎస్సీ తరహాలో ప్రతి ఆరు నెలలకు ఒకసారి టీఎస్‌పీఎస్‌సీ పరీక్షలను పారదర్శకంగా నిర్వహిస్తాం. నిరుద్యోగులకు వారు ఎంచుకున్న రంగంలో శిక్షణ ఇప్పించి మెరుగైన ఉపాధికి బాటలు వేస్తాం.

● **వలస కార్మికుల కోసం చర్యలు..?**

గల్ఫ్‌ వలస కార్మికుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. వారి సంక్షేమం, ఇతర అంశాలపై బీజేపీ అధిష్టానం పరిశీలన చేస్తోంది. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాగానే వలస కార్మికుల సంక్షేమానికి తొలి ప్రాధాన్యత ఇవ్వనుంది.

● **మీకు ప్రధాన పోటీ ఏ పార్టీతో ఉంది?**

బీజేపీకి ప్రధానమైన పోటీ ఇచ్చే స్థాయిలో ఏ పార్టీ లేదు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి రాష్ట్రంలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌లు రెండు పోటీయే కాదు. బీజేపీకి స్పష్టమైన మెజార్టీ రానుంది. కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌లను నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరు. నాకు ఏ పార్టీ పోటీ కానే కాదు.

బీఆర్‌ఎస్‌ పాలన అవినీతిమయం



యెండల లక్ష్మీనారాయణ

పదేళ్ల బీఆర్‌ఎస్‌ పాలన అంతా అవినీతిమయమని బాన్సువాడ బీజేపీ అభ్యర్థి యెండల లక్ష్మీనారాయణ అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో భారతదేశం ప్రపంచానికే గురువుగా నిలిచిందన్నారు. భారతదేశం సత్తా అంటే ఏంటో సగర్వంగా చాటారన్నారు. ఇలాంటి సమయంలో తెలంగాణలో ప్రభుత్వ పాలనను కేసీఆర్‌ భ్రష్టు పట్టించారన్నారు. శనివారం ఆయన 'సాక్షి' ఇంటర్వ్యూలో పలు విషయాలపై చర్చించారు.

–సాక్షి ప్రతినిధి, నిజామాబాద్‌

- బీజేపీతోనే అభివృద్ధి, సంక్షేమం
- బాన్సువాడలో ముగ్గురు షాడో ఎమ్మెల్యేలు
- 'సాక్షి' ఇంటర్వ్యూలో బీజేపీ అభ్యర్థి యెండల లక్ష్మీనారాయణ

■ **ఎన్నికల ప్రచారం ఏవిధంగా ఉంది?**

ప్రచారానికి మంచి స్పందన వస్తోంది. ఏ వాడకు వెళ్లినా ప్రజలు మోదీ పాలనను గుర్తు చేస్తున్నారు. బీజేపీ మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు తెలియజేస్తున్నాం.

■ **పార్టీశ్రేణుల సహకారం ఎలా ఉంది?**

పార్టీ శ్రేణులు, కార్యకర్తలు నా గెలుపు కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారు. స్వచ్ఛందంగా ప్రచారానికి వస్తున్న కార్యకర్తలు వాళ్ల ఇంటి నుంచే భోజనం తీసుకు వస్తున్నారు. ఏమీ ఆశించకుండా పనిచేస్తున్న కార్యకర్తలు నాకు తిరుగులేని బలం.

■ **ఏఏ అంశాలపై..?**

అభివృద్ధి, సంక్షేమం విషయంలో కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధుల గురించి వివరిస్తున్నాం. గ్రామపంచాయతీలు, క్రీడాప్రాంగణాలు, పల్లె ప్రకృతి వనాలు, హరితహారం కార్యక్రమాలకు వంద శాతం నిధులు, వైకుంఠధామాలు, సీసీ రోడ్లు, డ్రైన్లు, డంపింగ్‌ యార్డులకు 90శాతం నిధులు కేంద్రం నుంచే వస్తున్నాయి. ఉచిత రేషన్‌ బియ్యం, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి 50 శాతం నిధులు, ఆశా, అంగన్‌వాడీ ఉద్యోగుల జీతాల్లో సింహభాగం, కేసీఆర్‌ కిట్లలో రూ.6వేలు కేంద్ర ప్రభుత్వమే ఇస్తోందన్న విషయాలను వివరిస్తున్నాం. బీఆర్‌ఎస్‌ పెంచిన విద్యుత్‌, ఆర్టీసీ చార్జీలను ప్రజలకు తెలియజేస్తున్నాం.

■ **మీ దృష్టికి వచ్చిన సమస్యలు..?**

నియోజకవర్గంలో ముగ్గురు షాడో ఎమ్మెల్యేలు పెత్తనం చేస్తున్నారు. రోజూ రూ.కోట్లల్లో ఇసుక అక్రమ రవాణా అవుతున్న విషయం, తెలంగాణ తిరుపతి ఆలయంలో అవకతవకలు గురించి పలువురు చెబుతున్నారు. డబుల్‌ ఇళ్లను ప్రధానమంత్రి ఆవాస్‌ యోజన కింద నిర్మించి అసలైన అర్హులకు మాత్రం ఇవ్వలేదు.

■ **మీరిచ్చే హామీలు..?**

నిజాంషుగర్‌ ఫ్యాక్టరీని తెరిపిస్తాం. ఈ విషయంలో స్పీకర్‌ పోచారం శ్రీనివాసరెడ్డి, గతంలో వ్యవసాయ మంత్రిగా ఉండి కూడా ఏం మాట్లాడలేదు. విద్య, వైద్యం విషయాల్లో మరింతగా మెరుగైన సౌకర్యాల కల్పనకు పాటుపడతా. ప్రధానమంత్రి ఆవాస్‌ యోజన కింద అర్హులకు ఇళ్లు, పట్టాలు ఇప్పిస్తా. ఇసుకను స్థానికులకు అందుబాటులో ఉండేలా చేస్తా.

మార్పు కోరుకుంటున్న ప్రజలు



మాట్లాడుతున్న మండవ వెంకటేశ్వరరావు

డిచ్‌పల్లి/నిజామాబాద్‌ రూరల్‌: బీఆర్‌ఎస్‌ పాలనతో విసిగిపోయిన ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, ఆ మార్పులో భాగమయ్యేందుకే తాను కాంగ్రెస్‌లో చేరినట్లు మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు తెలిపారు. బోధన్‌లో శనివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్‌ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ సమక్షంలో మండవ కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం పార్టీ రూరల్‌ అభ్యర్థి భూపతిరెడ్డితో కలిసి క్యాంపు కార్యాలయంలో, డిచ్‌పల్లి మండలంలోని ధర్మారం(బి)లో ఉన్న తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశాల్లో మండవ మాట్లాడారు. తనకు పదవులపై ఎలాంటి వ్యామోహం లేదని, గతంలోనే తాను ఎన్నికల్లో పోటీ చేయనని చెప్పానన్నారు. అందుకే ఇటీవల టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తన ఇంటికి వచ్చి ఎన్నికల్లో పోటీ చేయాలని కోరినా వద్దని సున్నితంగా తిరస్కరించినట్లు తెలిపారు. తెలంగాణ ఉద్యమాన్ని పూర్తిగా అంటిపెట్టుకుని ఉన్న కేసీఆర్‌ను ప్రజలు విశ్వసించి రెండుసార్లు అధికారం కట్టబెడితే ఆ అదృష్టాన్ని కేసీఆర్‌ నిలుపుకోలేదన్నారు. చరిత్రలో నిలిచిపోవాల్సిన కేసీఆర్‌ నేడు విమర్శలకు గురవుతున్నారని పేర్కొన్నారు. రైతుబంధు పథకం అమలులో ఎన్నో లోపాలు ఉన్నాయన్నారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను కేసీఆర్‌ ప్రభుత్వం అప్పుల రాష్ట్రంగా మార్చిందన్నారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ పాలన గాడి తప్పిందని కాంగ్రెస్‌ రూరల్‌ అభ్యర్థి భూపతిరెడ్డి విమర్శించారు. సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాటిపల్లి నగేశ్‌రెడ్డి, ముప్పగంగారెడ్డి, శేఖర్‌గౌడ్‌, అమృతాపూర్‌ గంగాధర్‌, అజార్‌ కిషన్‌రావు, తారాచంద్‌, యాదగిరి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ విజయ భేరి సభ సక్సెస్‌

బోధన్‌టౌన్‌: పట్టణ శివారులో నిర్వహించిన కాంగ్రెస్‌ విజయ భేరి సభ సక్సెస్‌ అయ్యింది. సభకు నియోజకవర్గంలోని అన్ని మండలాల ప్రజలు భారీగా తరలివచ్చారు. సభకు ముఖ్య అతిథిగా ఏఐసీసీ ఉపాధ్యక్షుడు రాహుల్‌ గాంధీ హాజరై మాట్లాడారు. పార్టీ బోధన్‌ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డిని ఎన్నికల్లో గెలిపించాలని ప్రజలను కోరారు. సభలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌ తూము పద్మాశరత్‌రెడ్డి, నాయకులు ఈరవత్రి అనిల్‌, భూపతిరెడ్డి, సునీల్‌రెడ్డి, మండవ వెంకటేశ్వర్లు, తాహెర్‌బిన్‌ హందాన్‌, గంగాశంకర్‌, శరత్‌రెడ్డి, ఎల్లయ్య, నవీన్‌, రమేశ్‌, లావణ్య తదితరులు ఉన్నారు.

రాహుల్‌ గాంధీ సభ సైడ్‌ లైట్స్‌...

పట్టణ శివారులో నిర్వహించిన సభా ప్రాంగణానికి 12:11 గంటలకు హెలిక్యాప్టర్‌ వచ్చింది. 12:16లకు సభా వేదిక వద్దకు రాహుల్‌ గాంధీ వాహనంలో చేరుకున్నారు. 12:28లకు ప్రసంగాన్ని ప్రారంభించారు. 12:56లకు ప్రసంగాన్ని ముగించారు. 1:06లకు హెలిక్యాప్టర్‌ ఎక్కి వెళ్లిపోయారు.

భగవంతునిపై విశ్వాసం ఉండాలి



భక్తులకు తీర్థం అందిస్తున్న చిన్న జీయర్‌ స్వామి

నిజామాబాద్‌ సిటీ: భక్తి శ్రద్ధలతో భగవంతుడిని కొలిస్తే కోరుకున్న చోటుకు వస్తాడని శ్రీ త్రిదండి చిన్న రామానుజ జీయర్‌ స్వామి అన్నారు. నగరంలోని సుభాష్‌నగర్‌ రామాలయంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవ కార్యక్రమానికి చిన్న జీయర్‌ స్వామి శనివారం హాజరై ప్రవచనం చేశారు. ప్రతి ఏడాది ఆలయంలో ఉత్సావలు, పవిత్రోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం భక్తులకు తీర్థ గోష్ఠా చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్‌పర్సన్‌ సరళామహేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు చామకూర ప్రభాకర్‌రెడ్డి, కో–కన్వీనర్‌ గడీల రాములు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అరగుండు.. అరమీసం..



అరగుండుతో ఇండిపెండెంట్‌ అభ్యర్థి రాజశేఖర్‌ ప్రచారం

ఖలీల్‌వాడి(నిజామాబాద్‌ అర్బన్‌): నిజామాబాద్‌ రూరల్‌ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న బీఎల్‌ఎఫ్‌ కు చెందిన ఇండిపెండెంట్‌ అభ్యర్థి మేత్రి రాజశేఖర్‌ అరగుండు, అరమీసం, అరగడ్డంతో పాటు బిచ్చగాడి వేషధారణతో శనివారం వినూత్న ప్రచారం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆలోచనల తీరు ప్రతిబింబించేలా తనీ వేషధారణతో ప్రచారం నిర్వహిస్తున్నట్లు రాజశేఖర్‌ తెలిపారు. ఆ పార్టీల పాలనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు మేలుకోవాలని, ప్రజలు కండ్లు తెరవాలని అన్నారు. ప్రధాన పార్టీల మేనిఫెస్టోలోని అంశాలను ప్లకార్డుల ద్వారా ప్రదర్శిస్తూ భిక్షాటన చేశారు. కొల్లాపూర్‌లో బర్రెలక్క శిరీషపై దాడికి పాల్పడం సరైంది కాదన్నారు. ఆమెకు ఇండిపెండెంట్‌ అభ్యర్థిగా మద్దతు తెల్పుతున్నట్లు చెప్పారు. యువతీ, యువకులు చట్టసభలకు రావాలన్నారు.

దేవాదాయ శాఖ పరిధిలోకి బడా రాంమందిర్‌



ఈవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న వేణు

నిజామాబాద్‌ సిటీ: నగరంలోని బడా రాంమందిర్‌(గాజుల్‌పేట్‌) దాని అనుబంధ ఆలయం సారం గపూర్‌ హనుమాన్‌ మందిరాలను దేవాదాయ శాఖ పరిధిలోకి తీసుకొచ్చారు. దేవాదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్‌ ఆదేశాల మేరకు శనివారం జెండా బాలాజీ మందిరం ఈవో గింజుపల్లి వేణు బడా రాంమందిర్‌ ఫిట్‌ పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించారు. దేవాదాయ శాఖ జిల్లా పరిశీలకురాలు కమల ఆధ్వర్యంలో వేణు బాధ్యతలు చేపట్టారు. బడా రాంమందిర్‌, సారంగపూర్‌ హనుమాన్‌ ఆలయాల్లో హుండీలకు సీల్‌ వేశారు. కార్యక్రమంలో సాయిబాబా ఆలయ ఈవో రవీందర్‌ గుప్తా, జూనియర్‌ అసిస్టెంట్‌లు ఎస్‌ ఆంజనేయులు, ప్రశాంత్‌కుమార్‌, కిశోర్‌, సతీశ్‌, సాయి కిరణ్‌, చిన్నయ్య, అర్చకులు మకరంద్‌ శాఖయ్‌, రామకృష్ణ, ఎలక్ట్రీషన్‌ పోశెట్టి, అటెండర్‌ సోమయ్య పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

అల్లుడి చేతిలో మామ హతం

- నిందితుడిని చంపిన మృతుడి కుమారుడు



సైదాబోయి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

బిచ్కుంద: సంసార విషయంలో భార్యాభర్తల మధ్య నెలకొన్న గొడవ క్షణికావేశంలో పరస్పర దాడులతో రెండు ప్రాణాలు బలిగొన్నాయి. బిచ్కుంద మండలంలోని గుండెనెమ్లిలో శుక్రవారం అర్ధరాత్రి పరస్పర దాడులతో రాంబోయి (62), శాంతాపూర్‌ సైదాబోయి (42) మృతి చెందారు.

సీఐ కృష్ణ, ఎస్సై మురళి తెలిపిన వివరాల ప్రకారం.. గుండెనెమ్లికి చెందిన అరుణతో శాంతాపూర్‌ గ్రామానికి చెందిన సైదాబోయితో ఐదేళ్ల క్రితం రెండో వివాహం జరిగింది. రెండేళ్ల పాటు సాఫీగా సాగిన వీరి సంసారంలో గొడవలు మొదలయ్యాయి. మద్యానికి బానిసైన సైదాబోయి తరచూ భార్యను వేధిస్తుండడంతో అరుణ కూతురుతో కలిసి తల్లిగారింటికి వెళ్లింది. రెండున్నరేళ్లుగా భార్యాభర్తలు దూరంగా ఉంటున్నారు. దీంతో భార్యపై కోపం పెంచుకున్న సైదాబోయి శుక్రవారం రాత్రి గుండెనెమ్లికి చేరుకొని అరుణతో గొడవ పడి దాడి చేశాడు. గొడవలో అడ్డుగా వచ్చిన మామ రాంబోయి తలపై అల్లుడు సైదాబోయి కర్రతో బలంగా కొట్టాడు. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. దాడి విషయం తెలుసుకున్న రాంబోయి కుమారుడు సాయిలు తన తండ్రిని చంపాడనే కోపంతో బావ సైదాబోయిపై అదే కర్రతో దాడి చేయడంతో మృతిచెందాడు. మృతదేహాలను బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ, ఎస్సై పేర్కొన్నారు.

గుండెపోటుతో ఫీల్డ్‌అసిస్టెంట్‌..



సత్యనారాయణ(ఫైల్‌)

నాగిరెడ్డిపేట: మండల కేంద్రానికి చెందిన ఉపాధి హామీ ఫీల్డ్‌అసిస్టెంట్‌ బూర్గుపల్లి సత్యనారాయణ(54) శనివారం గుండె పోటుతో మృతిచెందారు. ఉదయం ఛాతిలో నొప్పి రావడంతో గమనించిన కుటుంబసభ్యులు వెంటనే చికిత్సనిమిత్తం మెదక్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించగా వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

చెట్టును ఢీకొన్న కారు

- ఒకరు మృతి, మరొకరి పరిస్థితి విషమం



ప్రసాద్‌(ఫైల్‌)

గాంధారి: మండల శివారులో చెట్టును కారు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఏఎస్సై గణేశ్‌ శనివారం తెలిపారు. గాంధారి–కామారెడ్డి ప్రధాన రహదారిపై వేగంగా వెళ్తున్న కారు చెట్టును ఢీకొన్నది. ఈ ఘటనలో కారులో ఉన్న సీతాయిపల్లి ఎంపీటీసీ సుమిత్ర కుమారుడు హరిశ్చంద్ర ప్రసాద్‌(24) అక్కడికక్కడే మృతి చెందగా గాంధారికి చెందిన కృష్ణమోహన్‌ పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించారు. మరో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా కామారెడ్డి ఏరియా ఆసుపత్రిలో చేర్పించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

రెంజల్‌: మండల శివారులో రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలైనట్లు ఎస్సై ఉదయ్‌ కుమార్‌ శనివారం తెలిపారు. రెంజల్‌లో విధులు నిర్వహించే జేఎల్‌ఎం మగ్దూం దూపల్లి నుంచి రెంజల్‌కు వస్తుండగా అదే గ్రామానికి చెందిన బుర్రోల్ల స్వామి రెంజల్‌ నుంచి నిజామాబాద్‌కు బైక్‌పై వెళ్తుండగా ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ఘటనలో స్వామి కుడికాలుకు తీవ్రగాయాలు కాగా మగ్దూం తలకు గాయాలైనట్లు తెలిపారు.

మనస్తాపంతో విద్యార్థిని ఆత్మహత్య



రిబిక (ఫైల్‌)

బాల్కొండ: మండలంలోని కిసాన్‌నగర్‌లో పదో తరగతి విద్యార్థిని శివరాత్రి రిబిక (17) ఇంట్లో ఉరేసుకుని శుక్రవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై గోపీ శనివారం తెలిపారు. రిబిక స్థానిక సెయింట్‌ ఎలిజబెత్‌ ప్రైవేట్‌ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. పదేళ్ల క్రితం రిబిక తల్లితండ్రులు అనారోగ్యంతో మృతి చెందారు. నాటి నుంచి రిబిక, మానసిక వికలాంగుడైన అన్న చిన్ననాన్న వద్ద ఉంటున్నారు. ఈ క్రమంలో తరచూ తల్లిదండ్రులు లేరంటూ బాధపడుతోంది. తానూ తల్లిదండ్రుల వద్దకే వెళ్తా.. ఐలవ్‌యూ డాడ్‌.. మామ్‌ అంటూ బుక్‌లో రాసుకునేదని తెలిపారు. దీంతో శుక్రవారం రాత్రి ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. రిబిక చిన్నమ్మ లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలోని బీచ్‌గల్లీలో తాళం వేసిన ఓ ఇంట్లో బంగారు, నగదును దుండగులు ఎత్తుకెళ్లినట్లు ఎస్సై అశోక్‌ శనివారం తెలిపారు. బీచ్‌గల్లీలో నివాసముండే లత తన తండ్రి మృతి చెందడంతో మెండోర మండలం నాగంపేటకు వెళ్లింది. అప్పటి నుంచి ఇంటికి తాళం ఉండడంతో దుండగులు శుక్రవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. శనివారం ఉదయం ఇంటి తాళం పగులగొట్టి ఉండడాన్ని గమనించిన స్థానికులు లతకు సమాచారం ఇచ్చారు. ఇంటికి చేరుకున్న లత చోరీ జరిగినట్లు గుర్తించారు. బీరువాలో ఉన్న 15 తులాల బంగారం, 20 తులాల వెండి, రూ.3 వేల నగదును దుండగులు ఎత్తుకెళ్లినట్లు బాధితురాలు తెలిపింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మద్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యంతో అధికారులు

నాగిరెడ్డిపేట: మండలంలోని బంజరతండా వద్ద బైక్‌పై అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని శుక్రవారంరాత్రి పట్టుకున్నట్లు ఎల్లారెడ్డి ఎక్సైజ్‌ సీఐ షాకీర్‌ అహ్మద్‌ తెలిపారు. తండా వద్ద నిర్వహించిన వాహనాల తనిఖీల్లో మండలంలోని మాటూర్‌ గ్రామానికి చెందిన బేస్త సత్యనారాయణ బైక్‌పై 12 మద్యం బాటిళ్లను తరలిస్తుండగా పట్టుకొని సీజ్‌ చేసి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. తనిఖీలో ఎస్సై జలీలుద్దీన్‌, హెడ్‌కానిస్టేబుళ్లు కె.భూపాల్‌, రాంచందర్‌, కానిస్టేబుళ్లు రవీందర్‌రెడ్డి, సంజీవ్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

మోటార్లను ఒకేసారి రన్‌ చేయొద్దు

మిషన్‌ భగీరథ సీఈ రాంచందర్‌



పంపుహౌస్‌ను పరిశీలిస్తున్న సీఈ రాంచందర్‌

సిరికొండ: మిషన్‌ భగీరథ పంపు హౌస్‌ల్లో మోటార్లను ఒకేసారి ఎక్కువగా రన్‌ చేయకూడదని చీఫ్‌ ఇంజినీర్‌ రాంచందర్‌ సిబ్బందికి సూచించారు. మండలంలోని లొంక, మైలారంలో ఉన్న మిషన్‌ భగీరథ పంపు హౌస్‌లను శనివారం తనిఖీ చేశారు. హౌస్‌లో మోటార్లను, వాటి పనితీరును పరిశీలించారు. పంపుల రన్నింగ్‌ను ఎనిమిది గంటలకు ఒకసారి మారుస్తూ ఉండాలని ఆపరేటర్లకు సూచించారు. పంపు హౌస్‌ల నిర్వహణ, కార్యాలయ ఆవరణలో చేపట్టిన మొక్కల పెంపకం బాగుందని సిబ్బందిని ప్రశంసించారు. ఆయన వెంట ఈఈ నరేశ్‌, డీఈ అరుణ్‌, ఏఈ శివ, మండల ఇన్‌చార్జి చారి, ఆపరేటర్‌ సూపర్‌వైజర్‌ రాజేశ్వర్‌, లైన్‌ సూపర్‌వైజర్‌ హేమంత్‌, అరవింద్‌, సిబ్బంది శంకర్‌, నర్సింగ్‌, విద్యాసాగర్‌, రవీందర్‌, సుమన్‌, మహిపాల్‌, నరహరి తదతరులు ఉన్నారు.

అంతర్జాతీయ క్రాఫ్‌లింగ్‌లో నేహాకు రజతం



నిజామాబాద్‌ నాగారం: అంతర్జాతీయ క్రాఫ్‌లింగ్‌(కుస్తీ) చాంపియన్‌షిప్‌లో జిల్లాకు చెందిన క్రీడాకారిణి ఎస్‌కే నేహా రజత పతకం సాధించింది. ఈనెల 17 నుంచి 19 వరకు రష్యాలో నిర్వహించిన కుస్తీ పోటీల్లో జిల్లా క్రీడాకారిణి ఉత్తమ ప్రతిభ కనబరిచి రజత పతకాన్ని కైవసం చేసుకుంది. మోపాల్‌ మండలంలోని మంచిప్పకు చెందిన నేహా డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. పతకం సాధించడంతో జిల్లా కుస్తీ సంఘం కార్యదర్శి నర్సింగ్‌రావు, కోచ్‌ దేవేందర్‌, క్రీడాకారులు నేహాకు అభినందనలు తెలిపారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

- రాజ్యసభ సభ్యుడు నిరంజన్‌ రెడ్డి



నిజామాబాద్‌ రూరల్‌: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని రాజ్యసభ సభ్యుడు, ప్రముఖ లాయర్‌ నిరంజన్‌ రెడ్డి శనివారం పేర్కొన్నారు. ముబారక్‌నగర్‌లో ఉన్న రాజ్‌బహదూర్‌వెంకట్రాంరెడ్డి (ఆర్‌బీవీఆర్‌ఆర్‌)స్కూల్‌ వార్షికోత్సవానికి ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఆ దిశగా పయనించాలని అన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో డీఆర్డీవో అడ్వయిజర్‌ సతీశ్‌ రెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.